క్లుప్తంగా

ఎమ్మెల్యే పేర్ని నాని దసరా శుభాకాంక్షలు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రజలకు బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం ఒక ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని, అన్ని విజయాలు చేకూరాలని, అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు సిద్ధించాలని కోరుకున్నారు.

కార్తికేయుని ఆలయం కిటకిట



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. దసరా ఉత్సవాలు, ఆదివారం సెలవు దినం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగజ్జననీ.. శక్తి స్వరూపిణీ


దుర్గాదేవిగా విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ


మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన కోడూరు గంగాభవానీ అమ్మవారు


కృష్ణాగారి శక్తిగుడిలో కాళికాదేవి


నాగాయలంక నగరేశ్వరుని సన్నిధిలో శ్రీదుర్గాదేవిగా అమ్మవారు

- దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు
- కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- కిటకిటలాడుతున్న దేవాలయాలు

కోడూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మవార్లు దుర్గాదేవితో పాటు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. భక్తుల పెద్దసంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. కోడూరులోని గంగాభవానీ అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అమ్మవారు సింహ వాహనంపై మహిషాసురుడి వధించేందుకు వెళ్తున్నట్లుగా చేసిన అలంకారం ఆకట్టుకుంది. సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. విశ్వనాథపల్లిలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. కోడూరు పార్వతి, దానాశక్తి, మందపాకల నాంచారమ్మ, హరిపురం మహంకాళి, మాచవరం తుంగపల్లెమ్మ, లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపుర సుందరీ, ఉల్లిపాలెం, హంసలదీవిలోని రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు. నరసింహపురంలోని కనకదుర్గమ్మ విగ్రహానికి దుర్గాదేవి అలంకారం చేసి, ఎనిమిది అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేశారు.

- **మచిలీపట్నంటౌన్:** బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి చామంతి, పొగడ, సంపెంగ, మల్లెపూలతో అర్చన చేశారు. దత్తాస్వామికి తైలాభి షేకం చేశారు. సాయంత్రం రాహుకాల దీపం వెలిగించారు. రాజుపేటలోని ముచ్చం గుడిలో మహిషాసురమర్దిని, కాళికాదేవి అలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు దుర్గాదేవిగా, కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధైర్య లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సామూహిక నవదుర్గ పూజ నిర్వహించారు. రాత్రికి నాట్యరవళి యెండూరి పావని, జ్ఞానశ్రీ చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అనంతరం పెద్దలకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. గీతా మందిరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దిని, లలితా అమ్మవారు సంతానలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఈడేపల్లిలోని కృష్ణాగారి శక్తిగుడిలోని కాళికాదేవి అమ్మవారికి పూజలు చేశారు.


కొక్కిలిగడ్డలో సామూహిక కుంకుమార్చన


కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవదుర్గ పూజలు


దుర్గాదేవి అలంకరణలో పెడన పైడమ్మ అమ్మవారు


చల్లపల్లిలో అమ్మవారి అలంకరణ


అవనిగడ్డలో దుర్గాదేవిగా రాజ్యలక్ష్మీ అమ్మవారు

- **గూడూరు:** గూడూరులోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, ద్వారకానగర్‌లోని యాదవుల రామాలయం, ఐదుగుళ్లపల్లిలోని శివాలయం తదితర గ్రామాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.
- **కృత్తివెన్ను:** కృత్తివెన్ను శివాలయంలోని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి.
- **మోపిదేవి:** కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, సువాసినీలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని దుర్గామాతగా, మోపిదేవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో, ఉత్తరచిరువోలులంకలో గుర్రమ్మ అమ్మవారి ఆలయంలో, పలు గ్రామాల్లో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని దుర్గమ్మగా అలంకరించి పూజలు నిర్వహించారు.

జయహో దుర్గాదేవి

నాగాయలంక: స్థానిక కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వర స్వామి దేవస్థానంలో పార్వతీదేవి, కన్యాంబ అమ్మవార్లు దుర్గాదేవిగా, భావదేవరపల్లి అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా, స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాద క్షేత్రం కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. మండలంలోని దుర్గా గణపేశ్వరస్వామి ఆలయాలలో దుర్గమ్మ, భావదేవరపల్లిలో గ్రామ దేవత అంకాలదేవరలను దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

- **నాగాయలంక:** స్థానిక పార్వతీ సమేత, కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం బాలకుమారి, సువాసినీలకు పూజ జరిపారు. నాగాయలంక ఎస్ఐ ఎం. సుబ్రహ్మణ్యం దంపతులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.
- **బంటుమిల్లి:** బంటుమిల్లి, పెద తుమ్మిడి, అర్తమూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవార్లను దుర్గాదేవిగాను, బంటుమిల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మీగాను, రామాలయంలో మహాలక్ష్మీదేవిగాను, పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. జానకిరామపురం, మల్లేశ్వరం, ముంజులూరు, మల్లంపూడి, లక్ష్మీనారాయణ పురం తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను నిలిపి అలంకారాలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు.

మహిషాసురమర్దినిగా కన్యకా పరమేశ్వరి

చల్లపల్లి: స్థానిక కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. నగర సంకీర్తన, పల్లకీ సేవ నిర్వహించారు. గ్రామంలోని తూర్పు రామాలయం, చంటి హోటల్ వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

- **పెడన:** పట్టణంలోని పైడమ్మ అమ్మవారి ఆలయంలోని అమ్మవారిని, స్థానిక వాసవీ క్షేత్రంలో వాసవీ మాతను దుర్గాదేవిగా అలంకరించారు. నిత్యపూజ, బాలభోగం, దుర్గాదేవి హోమం, లలితా పారాయణం, ప్రదోషకాలపూజ, తమలపాకులు, గులాబీలతో పూజాదికాలు నిర్వహించారు.
- **అవనిగడ్డ:** స్థానిక గీతా మందిరంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సతీమణి కెప్టెన్ లక్ష్మీ, కుమారుడు సింహాద్రి వికాస్–రవళి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, విశేష పూజలు జరిగాయి.


గూడూరు మహాలక్ష్మీ ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు


ఐదుగుళ్లపల్లిలో దుర్గాదేవిగా అమ్మవారు


పాశ్చాపురంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు


కృత్తివెన్నులో అపరాజితాదేవిగా అమ్మవారు

ఎమ్మెల్యే పేర్ని నాని దంపతుల చండీహోమం



మచిలీపట్నంటౌన్: స్థానిక బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం దసరా సందర్భంగా నిర్వహించిన చండీహోమం పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు పాల్గొన్నారు. ఏడునూతల సురేష్‌బాబు శర్మ, బాలకృష్ణ నేతృత్వంలో హోమపూజ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గాజుల భగవాన్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు అన్నంభొట్ల బ్రహ్మానందశాస్త్రి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డ్రెయినేజీ శాఖ కార్యాలయానికి శంకుస్థాపన

చల్లపల్లి: చల్లపల్లి సబ్ డివిజన్ డ్రెయినేజీ శాఖ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం ఉదయం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేస్తారని ఏఈ చిరంజీవి తెలిపారు. నూతన భవనం నిర్మాణానికి రూ.19 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.

పెద్దమనసు చాటుకున్న సింహాద్రి, కడవకొల్లు

సొంత నిధులతో పూడికతీత, మోటార్ల ఏర్పాట్లు

కోడూరు: మండలంలోని మందపాకల శివారు పాదాలవారిపాలెంలోని నాలుగో నంబర్ పంటకాలువ దిగువ పొలాలకు వర్షాభావ పరిస్థితుల వల్ల సాగునీరు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదు. పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండడంతో విషయాన్ని ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి రత్నకోడు (తాలేరు) డ్రెయిన్ నుంచి పూర్తిగా పూడిపోయిన నాలుగో నంబర్ పంట కాలువను సొంత నిధులతో పూడికతీత చేపట్టేందుకు ఆదివారం పనులను ప్రారంభించారు. పంటకాలువ పొడవునా భారీ పొక్లెయిన్‌తో పనులు చేస్తున్నారు. డ్రెయిన్‌లో నుంచి సాగునీటిని మళ్లించేందుకు అవసరమైన మూడు మోటార్లను కూడా రైతులకు అందించారు. విద్యుత్ సరఫరాకు అవసరమైన పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఆయకట్టున ఉన్న సుమారు 300 ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తంచేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎం. చంద్రరరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వెన్నా ప్రసాద్, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పరిశె భిక్షాలు, రైతులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.51,116 విరాళం

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివ రామకృష్ణ క్షేత్రానికి ధాన్యం వ్యాపారి తూనుగుంట్ల వెంకట రామశాస్త్రి రూ.51,116 విరాళంగా కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. సుమారు రూ.8 కోట్ల వ్యయంతో పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని వెంకట రామశాస్త్రి తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, శివరామకృష్ణ, సురేంద్ర పాల్గొన్నారు.

స్వామివారి సేవలో జైళ్ల శాఖ విశ్రాంత డీఐజీ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని జైళ్ల శాఖ విశ్రాంత డీఐజీ వైవీ సుబ్బారావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగ పుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గూడూరు: గూడూరులోని యాదవుల బజారు నుంచి పోలీస్ స్టేషన్ కూడలి వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకటకృష్ణారావు, సర్పంచ్ లింగం సులోచనా రాణి తదితరులు టెంకాయలు కొట్టి పనులను ప్రారంభించారు. రూ.70 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పంచాయతీ రాజ్ ఏఈ హరిబాబు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గతుకుల రోడ్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి జోగి రమేష్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించారని నాయకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పర్లం పెదబాబు, గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, విజయ్‌కుమార్, మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య సేవలు

కోనేరుసెంటర్: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నవీన్‌మిట్టల్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పది రూపాయల డాక్టర్‌గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ వైద్యురాలు నూరిపర్వీన్ 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా రవాణా శాఖాధికారి సీతాపతిరావు, డాక్టర్ లత, తోట సత్యనారాయణ, డాక్టర్ అబ్దుల్‌ఖాజా, కృష్ణప్రసాద్, మైత్రి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

చల్లపల్లి: గ్రామానికి చెందిన బాలబాలికలు ఇటీవల విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపారు. ఎం.శివ బాలాజీ, ఎ.కార్తికేయ, ఎ.హేమరాజు బంగారు పతకాలు సాధించారు. కందుల ప్రేమ్‌కుమార్, వై.అఖిల్, కె.వికాస్, ఎం. రాకేష్, ఎ.సిద్ధేష్, ఎం.సింహ రజత పతకాలు అందుకున్నారు. స్వర్ణ పతకాలు పొందిన వారు కడప జిల్లా పోరుమామిళ్లలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత పొందారు. వీరిని మోపిదేవి ఎస్ఐ సీహెచ్ పద్మ అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

చల్లపల్లి: గ్రామానికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ కోట సతీష్ ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు సతీష్‌కు రూ.3 వేల నగదు, రూ.4 వేల విలువగల నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు.

కొట్లాటపై కేసు నమోదు

కోనేరుసెంటర్: మచిలీపట్నం నిజాంపేటకు చెందిన వి. సత్యనారాయణ, కె. మణిలు నగరంలోని ఓ బార్‌లో మద్యం సేవించారు. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు గొడవ పడ్డారు. మణి అతని స్నేహితులు సత్యనారాయణపై దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇంటికి వెళ్లి సత్యనారాయణతోపాటు అతని భార్యపై దాడిచేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.